# జీడిమామిడి

జీడిమామిడి (అనకార్డియమ్ ఆక్సిడెంటేల్ ఎల్.) ఉష్ణమండలపు పంట. అనకార్డియేసి కుటుంబమునకు చెందిన దీని స్వస్థలం బ్రెజిల్ దేశం. దీనిని 16వ శతాబ్దంలో మొదటిసారిగా పోర్చుగీసువారు పశ్చిమ తీరాన గల గోవా ప్రాంతమందు నేలకోత అరికట్టడానికి ప్రవేశపెట్టారు.

జీడిమామిడి తోటలను వివిధ దేశములలో వాణిజ్య సరళిలో పెంచుతున్నారు. భారతదేశం ప్రపంచ జీడిమామిడి పరిశ్రమలో జీడిపిక్కల ఎగుమతి మరియు జీడి గింజల ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నది. సుమారు 10.06 లక్షల హెక్టార్లలో పంట పండించుచూ 7.36 లక్షల టన్నుల గింజలను ఉత్పత్తి చేసి సుమారు 5,058 కోట్ల రూపాయల విదేశీమారక ద్రవ్యమును ఆర్జించుచున్నది. మనదేశపు జీడి పరిశ్రమ సామర్థ్యము ప్రకారము దాదాపు 15 నుండి 16 లక్షల టన్నులు ముడిగింజల అవసరం ఉంటుంది. అందులో సుమారు 8.92 లక్షల టన్నుల జీడి గింజలను ఆఫ్రికా దేశాల నుండి దిగుబడి చేసుకొనుచున్నాము. భారతదేశపు సగటు ఉత్పాదకత ఒక హెక్టారుకు 772 కిలోలు మాత్రమే. వివిధ పరిశోధనల ఫలితాల ఆధారంగా 2000 నుండి 2500 కిలోల ముడి గింజల ఉత్పాదక సామర్థ్యం కలిగి ఉన్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో సగటు ఉత్పాదకత చాలా తక్కువగా ఉన్నది. మనదేశంలో జీడి గింజల ఉత్పత్తిలో మహారాష్ట్ర మొదటి స్థానములో, రెండవ స్థానములో ఆంధ్రప్రదేశ్ ఉంది.

జీడిమామిడి తోటలను ప్రధానంగా ఖమ్మం జిల్లా మరియు ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరప్రాంతంలో 1,26,121 హెక్టార్లలో పండిస్తున్నారు. ముడి గింజల ఉత్పత్తి 88,147 టన్నులు, ఉత్పాదకత కేవలం 646 కిలోలు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు క్షేత్రస్థాయిలో ఉపయోగించి అధిక సాంద్రతలో తోటలను పెంచుట ద్వారా హెక్టారుకు 2000 కిలోల ముడి గింజల ఉత్పాదకత పొందవచ్చును.

**నేలలు:** మన రాష్ట్రంలో ఇసుక నేలలు, ఎర్రనేలలు, గరపనేలలు, తేలికపాటి నేలలు కలిగిన కోస్తాతీర ప్రాంతాలు మరియు కొండ ప్రాంతాలలో అత్యల్ప ఉష్ణోగ్రత $8^0$ C కన్నా ఎక్కువగా కల ప్రదేశాలు అనువైనవి. నేలలోతు 1.5 మీ. కంటే హెచ్చుగా ఉండాలి. ఉదజని సూచిక 6.3-7.3 కలిగి, భూమిలో నీటి మట్టం 2.5 మీ. ఉండి, మురుగు నీటిపారుదల బాగా హెచ్చుగా ఉండాలి. జీడి తోటలకు ఎక్కువ ఉష్ణోగ్రత, వెలుతురుతో పాటు వాతావరణంలో ఎక్కువ తేమ అవసరం.

**వాతావరణం:** అధిక ఉష్ణోగ్రత, ఎక్కువ శాతం గాలిలో తేమ, పొగమంచు లేకుండా, ఎక్కువ వర్షపాతం, సముద్రతీర ప్రాంతము, అధిక సూర్యరశ్మి వున్న ప్రాంతాలు అనువైనవి.

**రకాలు:** జీడిమామిడి పరిశోధనా స్థానం, బాపట్ల ఎనిమిది జీడిమామిడి రకాలను విడుదల చేసింది. బి.పి.పి. 5,6,8,9 రకాల గింజలు మధ్యస్థంగాను, లావుగాను వుండుట వలన ఎగుమతికి ఎక్కువ అనుకూలంగా ఉంటాయి. బి.పి.పి.-2, వి.ఆర్.ఐ.-2 మరియు బి.పి.పి.-4 గింజలు చిన్నవిగా ఉండి అధిక దిగుబడి మరియు గుత్తికాపు రకాలు. మొదటిగా కాపు వచ్చే, అధిక దిగుబడి నిచ్చే గింజ సైజు పెద్దవిగా ఉండే రెండు లేక మూడు రకాల అంటు మొక్కలను కలిపి రైతులు నాటుకోవాలి. బి.పి.పి.-8 మరియు వెంగుర్ల-4 హైబ్రిడ్ రకములు జాతీయ రకములుగా గుర్తించబడినవి.

**రకాలు-లక్షణాలు:**

**బి.పి.పి.-1:** ఇది హైబ్రిడ్ రకం. దీని గింజలు మధ్యస్థ రకం సైజుతో సగటున 5 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు పసుపు, చెట్టు సగటు దిగుబడి 12 కిలోలు, పప్పు దిగుబడి 28 శాతం.

**బి.పి.పి.-2:** ఇది హైబ్రిడ్ రకం. దీని గింజలు చిన్నవిగా ఉండి సగటున 4 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు పసుపు, చెట్టు సగటు దిగుబడి 15 కిలోలు, పప్పు దిగుబడి 26 శాతం.

**బి.పి.పి.-3:** ఇది సింహాచలం నుండి ఎంపిక చేసిన రకం. దీని గింజలు మధ్య రకం సైజుతో 5 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు పసుపు, చెట్టు సగటు దిగుబడి 12 కిలోలు, పప్పు దిగుబడి 26 శాతం.

**బి.పి.పి.-4:** ఇది ఈపురుపాలెం నుండి ఎంపిక చేసిన రకం. దీని గింజలు చిన్నవిగా 4.5 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు పసుపు, చెట్టు సరాసరి దిగుబడి 16 కిలోలు, పప్పు దిగుబడి 26 శాతం.

**బి.పి.పి.-5:** ఇది ఎంపిక చేసిన రకం. దీని గింజలు మధ్య రకం సైజు కలిగి 5 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు పసుపు, చెట్టు సరాసరి దిగుబడి 18 కిలోలు, పప్పు దిగుబడి 25 శాతం.

**బి.పి.పి.-6:** ఇది ఎంపిక చేసిన రకం. దీని గింజలు మధ్య రకం సైజు కలిగి 6 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు పసుపు, చెట్టు సరాసరి దిగుబడి 15 కిలోలు, పప్పు దిగుబడి 26 శాతం.

**బి.పి.పి.-8:** ఇది హైబ్రిడ్ రకం. దీని గింజలు సైజు పెద్దదిగా ఉండి 8.2 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు పసుపు, చెట్టు సరాసరి దిగుబడి 21 కిలోలు, పప్పు దిగుబడి 27 శాతం.

**బి.పి.పి.-9:** ఇది హైబ్రిడ్ రకం. దీని గింజలు మధ్యస్థ రకం సైజు ఉండి 7.2 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు పసుపు, చెట్టు సరాసరి దిగుబడి 24 కిలోలు. పప్పు దిగుబడి 27 శాతం.

**వి.ఆర్.ఐ.-2:** ఇది తమిళనాడు మొక్క ఎంపిక రకం. దీని గింజలు మధ్యస్థంగా ఉండి 5.1 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు పసుపు, చెట్టు సరాసరి దిగుబడి 7.4 కిలోలు, పప్పు దిగుబడి 28 శాతం.

**వి.ఆర్.ఐ.-3:** ఇది తమిళనాడు మొక్క ఎంపిక రకం. దీని గింజలు మధ్యస్థంగా ఉండి 7.18 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు ఎరుపు, చెట్టు సరాసరి దిగుబడి 11.68 కిలోలు, పప్పు దిగుబడి 29.1 శాతం.

**వెంగుర్ల-4:** ఇది హైబ్రిడ్ రకం. ప్రాంతీయ పరిశోధనా స్థానం, వెంగుర్ల, మహారాష్ట్ర నుండి విడుదల చేయబడినది. దీని గింజలు మధ్యస్థ రకం సైజు కలిగి 7.7 గ్రా. బరువు ఉంటాయి. ఏపిల్ రంగు ఎరుపు, చెట్టు సరాసరి దిగుబడి 17.2 కిలోలు, పప్పు దిగుబడి 31%.

బి.పి.పి.-1,2,4,8,9 మరియు వి.ఆర్.ఐ.-2 రకాలు ఫిబ్రవరి, మే నెలల్లో పూత, కాపు కొస్తాయి. బి.పి.పి.-3 రకం మార్చి-మే నెలల్లో పూత, కాపుకొస్తుంది. బి.పి.పి.-6 రకం మార్చి-జూన్ నెలల్లో ఆలస్యంగా పూత, కాపు కొస్తుంది.

**జీడి అంట్ల ఎంపిక:** 6-12 నెలల వయసు, 10-15 ఆకులు కలిగి ఉన్న మేలైన అంటు మొక్కలను ఎంపిక చేసుకొని, మొక్క వేర్ల చుట్టూ వున్న మట్టి విడిపోకుండా పాలిథీన్ సంచిని జాగ్రత్తగా తొలగించి, అంటు అతుకు భాగము 5 సెం.మీ. నేలకు పైన ఉండునట్లుగా చూసుకొని నాటాలి. నాటిన వెంటనే మొక్కకు నీరు పోసి, ఊతంగా కర్రను కట్టాలి. మొక్కలకు స్థానికముగా లభించు తాటాకులను ఉపయోగించి వేసవి కాలములో అధిక ఉష్ణోగ్రతల నుండి రక్షణ కల్పించవలెను.

**నాటటం:** వర్షాకాలములో మొదటి వర్షాలు పడిన తరువాత జూన్-జూలై నెలలో ఒకటిన్నర సంవత్సరముల వయస్సు కలిగిన నాణ్యమైన ఎంపిక చేయబడిన అంటుమొక్కలను ఎకరాకు 80 మొక్కల చొప్పున 7×7 మీ. లేక 8×4 మీ. దూరంలో 1×1×1 మీ. సైజు గుంటల్లో నాటాలి. జాగ్రత్తగా అంట్ల మొక్క వేళ్ళ చుట్టూ వున్న మట్టి విడిపోకుండా పాలిథీన్ సంచిని తొలగించి అంటు భాగం భూమికి పైన 7.5 నుండి 10 సెం.మీ. ఉండేటట్లు నాటాలి. గట్టి కర్ర పుల్లను అంటు మొక్కలకు ఊతంగా కట్టాలి. అంటు కట్టిన భాగాన వున్న పాలిథీన్ దారాన్ని తొలగించి, అంటు వేరు మూలం నుండి వచ్చు పక్క కొమ్మలను తొలగిస్తూ ఉండాలి.

**నీటియాజమాన్యం:** జీడి అంటుమొక్కలను పొలంలో నాటిన తరువాత మొదటి రెండు సంవత్సరములు తప్పక నీటి వసతి కల్పించాలి. పిందె, కాయ పెరిగే సమయంలో నీరు పెడితే కాయ, గింజ సైజు పెరిగి దిగుబడులు పెరుగుతాయి. డ్రిప్ ద్వారా జీడిమామిడికి నీరిస్తే 60 శాతం వరకు నీటిని ఆదా చేయవచ్చును. డ్రిప్ ద్వారా 4 డ్రిప్పర్లలో కాపుకు వచ్చిన తోటల్లో చెట్టుకు 4 రోజుల వ్యవధితో డిసెంబరు రెండవ పక్షం నుండి మార్చి చివరి వరకు నీరు యిచ్చినచో అధిక దిగుబడులు పొందవచ్చును. మార్చి తరువాత నీటి తడులు నిలిపి వేయాలి. 7×7 మీ. దూరంలో నాటినపుడు సుమారుగా ఎకరాకు డ్రిప్ కొరకు అయ్యే ఖర్చు రూ.10,000/-. మొదటి రెండు సంవత్సరాల్లో వచ్చిన పూతను తొలగించవలెను. 3వ సంవత్సరము నుండి మాత్రమే కాపును తీసుకోవాలి.

**కత్తిరింపులు:** లేత తోటల్లో భూమికి 1 మీటరు ఎత్తు వరకు ఉన్న క్రింది కొమ్మలను కత్తిరించి ఏపుగా వృత్తాకారంలో పెరిగేటట్లు మొక్కను ట్రైనింగ్ చేయాలి. ముదురు తోటల్లో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జూలై-ఆగష్టు మాసాల్లో ఎండుకొమ్మలు, భూమికి ఆనుకొని వున్న కొమ్మలు, ఇతర చెట్ల మీదకు పోయిన కొమ్మలు, నీడన వున్న కొమ్మలు మొదలగు వాటిని కత్తిరించటం వలన, శుభ్రంగా ఉంచడంతోపాటు మొక్కలకు తగినంత సూర్యరశ్మి వెలుతురు, గాలి సోకి కొమ్మలు ఎక్కువగా వచ్చి దిగుబడి పెరుగుతుంది. కత్తిరించిన భాగాలకు శిలీంధ్రాలు సోకకుండా 10 శాతం బోర్డోపేస్టు పూయాలి. చిన్న కొమ్మలైతే 1 శాతం బోర్డోపేస్టు మిశ్రమం పిచికారి చేయాలి.

**కలుపు నివారణ, అంతరకృషి:** తోటనాటిన తరువాత తొలి 2-3 సం॥ వేసవికాలంలో దక్షిణ దిశలో తప్ప మిగిలిన దిశల్లో తాటాకులను కంచెగా ఏర్పాటు చేయాలి. లేత మొక్కల పాదుల్లో ఎండుగడ్డి లేదా ఎండు ఆకులు పరచటం వలన వేసవిలో నేల తేమ ఆవిరికాకుండా కాపాడబడి, కలుపు నివారించబడుతుంది. తొలకరిలో వరుసల మధ్య భూమిని దున్ని కలుపు లేకుండ చేయాలి.

**ఎరువులు:** ఎంపిక చేయబడిన అంటు మొక్కల్ని నాటటానికి ముందుగా గుంతల్లో 10 కిలోల పశువుల ఎరువు, 2 కిలోల వేపపిండి, 200 గ్రా. సూపర్‌ఫాస్ఫేటును కలిపి వేయాలి. మొదటి సంవత్సరము మొక్కలకు సేంద్రీయ ఎరువులను మాత్రమే ఇవ్వాలి. రెండవ సంవత్సరము నుండి సేంద్రీయ ఎరువులతో (వేపపిండి, పశువుల ఎరువు, కంపోస్టు) పాటు సిఫార్సు చేసిన మోతాదులో రసాయనిక ఎరువులు వేయాలి. 5 సంవత్సరాల వయస్సున్న జీడి చెట్లకు 1000 గ్రా. నత్రజని (2200 గ్రా. యూరియా) 125 గ్రా. భాస్వరం (750 గ్రా. సూపర్ ఫాస్ఫేటు) మరియు 125 గ్రా. పొటాష్ (225 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్)ను ఇవ్వాలి. రసాయనిక ఎరువులను చెట్టు మొదలు నుండి 1మీ. లేక 1 1/2 మీటరు దూరంలో చుట్టూ 15 సెం.మీ. వెడల్పు మరియు లోతు గాడి చేసి అందులో వేసి మట్టితో కప్పవలెను. పైన వివరించిన మోతాదులో సగభాగం జూన్-జూలై నెలల్లో మిగిలిన సగభాగం సెప్టెంబరు-అక్టోబరు నెలల్లో వేస్తే మంచి ఫలితాలు పొందవచ్చును.

**ఎరువుల పట్టిక:**

| | మొదటి దఫా(గ్రా./చెట్టుకు) | | | రెండవ దఫా(గ్రా./చెట్టుకు) | | |
|---|---|---|---|---|---|---|
| చెట్టు వయస్సు | నత్రజని | భాస్వరం | పొటాష్ | నత్రజని | భాస్వరం | పొటాష్ |
| మొదటి సం॥ | 0 | 0 | 0 | 0 | 0 | 0 |
| రెండవ సం॥ | 100 | 25 | 25 | 100 | 25 | 25 |
| మూడవ సం॥ | 150 | 40 | 60 | 150 | 40 | 60 |
| నాల్గవ సం॥ | 200 | 50 | 60 | 200 | 50 | 60 |
| ఐదవ సం॥ | 500 | 60 | 60 | 500 | 60 | 60 |

అంతర పంటలు: తోటనాటిన తొలి సంవత్సరాల్లో మొక్కల మధ్య గల స్థలంలో వివిధ కూరగాయలు, పూల మొక్కలలో బంతి, చేమంతి, ఏస్టర్స్, మల్లెపూవు తోటలను, అనాసపళ్ళ తోటలను, పొగాకు నారుమడి, మిరప, వరినారు, వేరుశనగ, పప్పుధాన్యాలను అంతరపంటలుగా పెంచి అధిక రాబడులను పొందవచ్చును.

**పూత సమయం:** జీడిమామిడి సాధారణంగా 3-4 సంవత్సరాలలో కాపుకు వచ్చును. సాధారాణంగా జనవరి నెల రెండవ పక్షం నుంచి ఫిబ్రవరి మొదటి పక్షంలో పూత మొదలవుతుంది. ప్రతి పుష్పగుచ్ఛంలో సుమారు 200-1600 వందల పుష్పాలు వుంటాయి. ఇందులో సుమారు 90 శాతం వరకు మగ పుష్పాలు మిగిలినవి ద్విలింగ పుష్పాలు. జీడిమామిడిలో పూత రెండు, మూడు దఫాలుగా వచ్చును. కాని మధ్యస్థ దశలో వచ్చే పుష్పాలు ఎక్కువగా ఫలించి, అధిక దిగుబడికి తోడ్పడతాయి. పూత నుండి కాపు వరకు సుమారు 3 నెలలు పడుతుంది. జీడిగింజలు కోసే సమయం ఆయా ప్రాంతాలను బట్టి లేదా రకాన్ని బట్టి మారుతుంది.

**సస్యరక్షణ:**

**పురుగులు:**

మన రాష్ట్రములో సాగుచేయబడుతున్న జీడిమామిడిని 90 రకాల కీటక జాతులు నష్టపరచేవిగా గుర్తించారు. వాటిలో జీడిమామిడి కాండం మరియు వేరు తొలుచు పురుగు, లేత చిగురు మరియు పుష్ప గుచ్ఛాలను ఆశించే టీ దోమ, అతి ముఖ్యమైన చీడ పురుగులు, ఇవే కాకుండా ఆకు మరియు పూత గూడుకట్టు పురుగు, ఆకు ముడత పురుగు, కొమ్మ, పుష్ప గుచ్ఛాలను తొలిచే పురుగు, కాయ మరియు గింజ తినే పురుగు, తామర పురుగులు, పిండి నల్లి మొదలైనవి నవంబర్-ఏప్రిల్ ఆశించి పంటకు ఎక్కువ నష్టం కలుగజేస్తాయి.

**కాండం మరియు వేరు తొలుచు పురుగు:**

ఈ పురుగును జీడిమామిడి చెట్ల ఆగర్భ శత్రువుగా చెప్పవచ్చు. ఇది చెట్టును సమూలంగా నాశనం చేస్తుంది. సాధారణంగా ఇది ఎక్కువగా ముదురు తోటల్లో, నిర్లక్ష్యం చేయడిన తోటల్లో కనిపిస్తుంది. జీడిమామిడి తోటల్లో ఇది సంవత్సరం పొడవునా కనిపిస్తుంది కానీ డిసెంబర్ నుండి మే మాసాలలో నష్ట తీవ్రత ఎక్కువగా ఉంటుంది. తల్లి పురుగు జీడిమామిడి చెట్టు ప్రధానం కాండంపై గల బెరడు పగుళ్ళల్లోను, బయటకు కనిపించు వేరు బెరడుపైనా బియ్యపు గింజ మాదిరి కనిపించే గుడ్లను పెడతాయి. గుడ్ల నుండి పిల్ల పురుగులు 5-7 రోజులలో బయటకు వస్తాయి. గుడ్ల నుండి బయటకు వచ్చిన లద్దె పురుగులు బెరడుపై రంధ్రాలు చేసి తొలుచుకుంటూ కాండం మరియు వేరు లోపలికి చేరుతాయి. కాండం లేదా వేరు లోపల ఒక క్రమ పద్ధతి లేకుండా తొలచడం వలన సొరంగాలు ఏర్పడతాయి. ఈ లద్దెపురుగు పరిమాణం పెరిగే కొలది సొరంగాల పరిమాణం కూడా పెరుగుతుంది. ఈ పురుగు తిని విసర్జించిన పదార్థాలు చెక్కపొడి రూపంలోను, నల్లని బంక రూపంలో ఉండి సొరంగాలను నింపి వేస్తుంది. దీని మూలంగా చెట్టు జీవ నాళములు తెగిపోయి జీవ రసప్రవాహం చెట్టులో ఆగిపోయి క్రమంగా ఆకులు పండుబారి రాలిపోతాయి. కొమ్మలు ఎండిపోతాయి. ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు కొమ్మలు ఎండిపోయి చివరకు చెట్లు చనిపోతాయి. దీని జీవిత చక్రం దాదాపు సంవత్సరం

ఎ ా ట ం

ఉంటుంది. ఈ పురుగు కాండం లేదా వేరు లోపల దాదాపు 6-8 నెలలు తింటూ జీవిస్తుంది. అనంతరం పూర్తిగా ఎదిగిన లద్దె పురుగు కాండం లేదా వేరు లోపల అది స్రవించిన కాల్షియంతో రక్షక కవచాన్ని తయారుచేసుకొని కోశస్థ దశకు చేరుకుంటుంది. కోశస్థ దశలో 60-90 రోజుల పాటు ఉంటుంది. తదుపరి వృద్ధి చెందిన ధృడమైన రెక్కల పురుగుగా మారి బయటకు వచ్చి తన జీవిత చక్రాన్ని కొనసాగిస్తుంది.

ఈ పురుగు ఆశించిన చెట్లను ముఖ్యముగా ముదిరిన దశలో రక్షించడం కష్టమైన పని కాబట్టి ప్రారంభ దశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి.

**నివారణ:** సాధారణంగా కాండం మరియు వేరు పురుగు నిర్లక్ష్యము చేయబడిన గింజల ద్వారా ప్రవర్ధనం చేయబడిన ముదురు తోటలను (7 సంవత్సరాలు ఆపైన) మాత్రమే ఆశిస్తుంది. కాబట్టి 7 సంవత్సరాలు ఆపై వయస్సు గల చెట్ల కాండం మొదట (3 అడుగుల ఎత్తు వరకు) మరియు భూమిపైన కనబడే వేర్లు, సన్నని ఇనుపవైరుతో చేసిన బ్రష్‌తో బాగా రుద్ది ఆ తరువాత బాగా తడిచేలా 5 శాతం వేపనూనె ద్రావణాన్ని నాలుగు నెలలకు ఒకసారి చొప్పున సంవత్సరంలో మూడుసార్లు పిచికారి చేయాలి లేదా పూత పూయాలి. వేపనూనె నీటిలో కరగదు. కావున ప్రతి లీటరు నీటికి 0.5 గ్రా. సబ్బుగాని, సర్ఫ్ గాని కలిపి గిలకొట్టి ఆ తర్వాత 50 మి.లీ. వేపనూనెను కలిపి బాగా కలిసేటట్లు పుల్లతో కలియబెట్టాలి. పైన చెప్పిన విధంగా కాండాన్ని, వేర్లను బ్రష్‌తో రుద్ది, వేపనూనె 5 శాతము సంవత్సరానికి మూడుసార్లు పిచికారి చేస్తే తోటలోని చెట్లకు ఈ పురుగు సోకే అవకాశం తగ్గుతుంది. ఈ పురుగు ఆశించిన చెట్ల నుండి బంక కారుతూ ఉంటుంది. వెంటనే బెరడు క్రింద దాగి ఉన్న లద్దెపురుగులను తొలగించాలి. బెరడు చెక్కిన చోట వెంటనే క్లోరిపైరిపాస్ 10 మి.లీ./లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఈ పురుగులను తొలగించనట్లయితే క్రమేణా చెట్లు చనిపోతాయి. చెక్కిన బెరడు ముక్కలను కాండం నుండి కారిన బంకను, చెక్కపొడిని భూమిలో పాతిపెట్టాలి. తోటలను పరిశుభ్రంగా ఉంచాలి. తుది దశలో పురుగులు సోకిన చెట్ల ఆకులు పసుపు రంగుకు మారతాయి. ఆ తరువాత ఆకులు అన్ని రాలి మోడువారి, ఎండిపోయి చనిపోతాయి. కాబట్టి ఆకులు పూర్తిగా పసుపు రంగుకు మారగానే చెట్లను వెంటనే వేర్లతో సహా తీసివేసి వేర్లలో దాగి ఉన్న ప్యూపాలను చంపి సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. చెట్లు తొలగించిన గుంటల్లో ఎండిన చెత్త వేసి తగులబెట్టాలి.

**టీ దోమ/తేయాకు దోమ:**

జీడిమామిడి నష్టం కలిగించే పురుగులలో ఇది కూడా చాలా ముఖ్యమైనది. టీ దోమ యొక్క ఉధృతి ఎక్కువగా ఉత్తర కోస్తా జిల్లాల్లో కనిపిస్తుంది. టీ దోమ యొక్క పిల్ల పురుగులు మరియు తల్లి పురుగులు జీడిమామిడి లేత కొమ్మలను, పూత రెమ్మలను ఆశించి రసాన్ని పీల్చడం మన ఎర్రని జిగురు బిందువులు, పూత రెమ్మలపై నల్లని పొడవైన కండె ఆకారపు మచ్చలు ఏర్పడతాయి. పూత పిందెలు మాడిపోయి రాలిపోవడం వలన దిగుబడి తగ్గుతుంది. విపరీత పరిస్థితులలో చెట్టంతా మాడిపోయినట్లు అవుతుంది.

**నివారణ: మొదటి సారి:** క్రొత్త చిగురు వచ్చే సమయంలో మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**రెండవ సారి:** పూత వచ్చిన తరువాత లామ్డాసైహలోత్రిన్ 0.6 మి.లీ. లేదా క్లోరిఫైరిఫాస్ 2.0 మి.లీ. ఒక లీటరు నీటిని కలిపి పిచికారి చేయాలి.

**మూడవ సారి:** గింజ బఠాణీ సైజులో ఉన్నప్పుడు ప్రొఫెనోఫాస్ 1.0 మి.లీ. ఒక లీటరు నీటికి 10 నుండి 25 రోజుల వ్యవధిలో పురుగు ఉధృతిని బట్టి పిచికారి చేయవలెను.

పైన సూచించిన మందులు డిశంబర్ నుండి మార్చి నెల వరకు అవసరాన్ని బట్టి రెండు లేక మూడు సార్లు మార్చి మార్చి పిచికారి చేయడం ద్వారా జీడిమామిడిని ఆశించే పురుగులను అందుపులో ఉంచవచ్చు. మందు ద్రావణం చెట్టు మొత్తం, కాండం, కొమ్మలు, ఆకులు, చిగుర్లు, పూత, పిందె బాగా తడిచేటట్లు పిచికారి చేయాలి.

**ఆకు మరియు పూత గూడు కట్టు పురుగు:**

ఈ పురుగు వల్ల లేత మొక్కలకు హాని ఎక్కువ. ఈ పురుగు ముఖ్యముగా క్రొత్త చిగురు, పూత దశలో ఎక్కువగా కనిపిస్తుంది. ఆకులను పూతను గూడు కట్టుట వలన కొమ్మల చివర బూజు ఏర్పడతాయి. లేత ఆకులను కొమ్మల చివర్లనూ, పుష్పగుచ్ఛాలను తినడం వలన పూత పూయక ఫలసాయం తగ్గుతుంది. ఇది ఎదుగుతూ ఉన్న గింజలను, పండ్లను గీకడం వలన కూడా దిగుబడి, నాణ్యత తగ్గుతాయి.

**కొమ్మ, పుష్పగుచ్ఛాలను తొలచే పురుగు:**

ఈ పురుగు లేత కొమ్మల చివర్లను తొలచి, సొరంగము చేసి లోపలి గుజ్జు తింటుంది. పుష్పగుచ్ఛాలను కూడా తొలుస్తుంది. అందువలన లేత కొమ్మలు, పుష్పగుచ్ఛాలు ఎండిపోతాయి. ఫలితంగా దిగుబడి తగ్గుతాయి.

**కాయ, గింజ తినే పురుగు:**

ఈ పురుగు కాయ, గింజ మధ్యగల ప్రదేశం ద్వారా లోపలికి ప్రవేశించి పండులోని గుజ్జును, గింజలోని పప్పును తింటుంది. ఫలితంగా గింజలు, కాయలు ఎదగక కుళ్లిపోయి దిగుబడి తగ్గుతుంది.

**తామర పురుగులు:**

వర్షాకాలంలో వీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఈ పురుగులు పుష్పగుచ్ఛాలను, ఎదుగుతున్న కాయలను, పండ్లను గీకి రసం పీల్చడం వలన గరుకు మచ్చలు ఏర్పడి దిగుబడి, నాణ్యత తగ్గుతుంది.

**నివారణ:**

డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**పిండినల్లి:**

తల్లి మరియు పిల్ల పురుగులు లేత ఆకుల నుండి, కాండం నుండి, పుష్పగుచ్ఛాల నుండి, కాయల నుండి రసాన్ని పీలుస్తాయి. ఈ పురుగు ఆశిస్తే చెట్టు పాలిపోయి తక్కువ దిగుబడిని ఇస్తుంది. ఈ పురుగులు తేనె లాంటి జిగురు పదార్థాన్ని విసర్జించడం వలన దానిపై మసి తెగులు వృద్ధి చెందుతుంది.

**నివారణ:**

పిండినల్లి ఆశించిన భాగాలను తృంచి నాశనం చేయాలి. వీటి ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు డైక్లోరోవాస్ 2.5 మి.లీ. లేదా డైమోథోయేట్ 1.75 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తెగుళ్ళు:**

**బ్లైట్:** ఈ తెగులు వలన పుష్పగుచ్ఛాలు, ఎదుగుతున్న గింజలు మెత్తబడి, పూర్తిగా ఎదగక ఎండి రాలిపోతాయి. అవసరాన్ని బట్టి కార్బండిజమ్ 1.0 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**దిగుబడి:** 3వ సంవత్సరములో అంటుమొక్కల నుండి కాపు తీసుకోవాలి. చెట్ల వయస్సు పెరిగే కొద్దీ పంట దిగుబడి పెరుగుతుంది. మంచి రకాల అంట్ల ద్వారా తోటలు పెంచినపుడు 10 సంవత్సరాల వయసు గల తోటల నుండి సరాసరి చెట్టుకు 10 కిలోల కన్న ఎక్కువ దిగుబడి లభిస్తుంది. ఒక కిలో గింజల నుండి 250 గ్రా. పైగా పప్పు లభిస్తుంది. చెట్ల క్రింద రాలిన జీడిపండ్ల నుండి జీడి పిక్కలను వేరుచేసి దాదాపు వారం రోజులు పిక్కలను ఎండబెట్టాలి.

**జీడి అంట్లు దొరికే ప్రదేశాలు:**

**1.** సీనియర్ సైంటిస్ట్ (హార్టికల్చర్) & హెడ్, జీడిమామిడి పరిశోధనా స్థానం, బాపట్ల 522 101, గుంటూరు జిల్లా.

**2.** సీనియర్ సైంటిస్ట్ (హార్టికల్చర్) & హెడ్, ఉద్యాన పరిశోధనా స్థానం, పందిరి మామిడి 533 288, తూర్పుగోదావరి జిల్లా., ఫోన్: 08864-243 577.

**3.** జాతీయ జీడిమామిడి పరిశోధనా స్థానం, పుత్తూరు, దక్షిణ కన్నడ జిల్లా, కర్ణాటక ఫోన్ నెం: 08251-231530

**4.** సీనియర్ సైంటిస్ట్ & హెడ్, కృషి విజ్ఞాన కేంద్రం, పందిరి మామిడి, తూర్పు గోదావరి జిల్లా, ఫోన్: 08864-242 099.

జీడిమామిడి సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన చిరునామా

**సీనియర్ సైంటిస్ట్ (హార్టికల్చర్) మరియు హెడ్, ఉద్యాన పరిశోధనా స్థానం,**

అశ్వారావుపేట, ఖమ్మం జిల్లా. ఫోన్: 08740-200241